క్లుప్తంగా

తీరనున్న కుక్కల బెడద



సెంటర్ నిర్వాహకులకు అందజేస్తున్న వర్క్ ఆర్డర్ కాపీ

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ ప్రజలకు మరో పది రోజుల్లో కుక్కల బెడద తీరనుందని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తెలిపారు. శనివారం మెదక్ పట్టణంలోని 4వ వార్డులో ఏర్పాటు చేసిన ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ నిర్వాహణను నవోదయ వెట్ సొసైటీకి వర్క్ ఆర్డర్ అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజల కోరిక మేరకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. చిట్కుల్ అంగన్‌వాడీ బాగుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, షజనాజ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలు



బోనాలతో విద్యార్థినులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మంజీరా విద్యాలయంలో విద్యార్థులు శనివారం బోనాల పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బోనాలతో సందడి చేశారు. బోనాల విశిష్టతను ఉపాధ్యాయురాలు వాసవి వారికి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేశ్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రామాయంపేట, నిజాంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాయంపేట సీఐ వెంకట రాజాగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ వలన జీవితం నాశనం అవుతుందని తెలిపారు. అలాగే ఎవరైనా అగంతకులు ఫోన్ చేసినప్పుడు ఓటీపీ తెలుపరాదన్నారు. తెలియన లింక్‌లు పంపి వాటిపై క్లిక్ చేయరాదని తెలిపారు. అనంతరం క్విజ్‌లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిజాంపేట ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో వనమహోత్సవం

చేగుంట(తూప్రాన్): మండలంలోని గల్లపల్లి గ్రామంలో శనివారం మండల ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలను నాటి ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ మాట్లాడారు. అందరూ తమవంతుగా మొక్కలు నాటి పెంచాల న్నారు. అనంతరం జెత్రం తండాలో గ్రామ సభను నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తండా వాసులకు వివరించారు. ఈ ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఏపీఓ శ్వేత, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సన్మానం



కేంద్ర సహాయ మంత్రితో బీజేపీ నాయకులు

నర్సాపూర్: కేంద్ర సహాయ మంత్రిని నర్సాపూర్ బీజేపీ నాయకులు సన్మానించారు. శనివారం కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అత్వాలే హైదరాబాద్ నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వెళ్లారు. నర్సాపూర్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్‌తో పలువురు నాయకులు మంత్రి కాన్వాయ్‌ని నర్సాపూర్‌లో ఆపి ఆయన్ను ఘనంగా సన్మానించారు. వారి వెంట పార్టీ నాయకులు నగేష్, ఆంజనేయులుగౌడ్, ప్రేంకుమార్, నగేష్‌గౌడ్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

సంతలో తీరొక్క తృణధాన్యాలు

- పాపన్నపేటలో గింజల అంగడి



పాపన్నపేట అంగడిలో తృణ ధాన్యాల దుకాణం

పాపన్నపేట(మెదక్): ఒక్కో ప్రాంతంలో జరిగే సంతకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా మండల కేంద్రం పాపన్నపేటలో బుధవారం జరిగే సంతలో గింజల బజార్ చాలా ప్రత్యేకమైంది. సంస్థానాధీశుల కోటగా ప్రసిద్ధి కెక్కిన పాపన్నపేటలో సుమారు వందేళ్లుగా బుధవారం సంత జరుగుతోంది. టేక్మాల్, అల్లాదుర్గం, శంకరంపేట, రేగోడ్, మెదక్, నారాయణఖేడ్, కొల్చారం, మెదక్, నిజాంబాద్ జిల్లా గోపాల్‌పేట, ఎల్లారెడ్డి మండలాల నుంచి సుమారు 3 నుంచి 4 వేల పల్లె వాసులు సంతకు వస్తుంటారు. ఇక్కడి అంగడిలో తృణ ధాన్యాలు ఉంటాయి. నీటి సౌకర్యం పెరిగిన నేపథ్యంలో చాలా మంది రైతులు వరి పంట, కూరగాయల వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో తృణ ధాన్యాల పంటలు లేకుండా పోయాయి. అయితే నారాయణఖేడ్, కోళ్లపల్లి, రేగోడ్ మండలాల నుంచి వచ్చే వ్యాపారులు తృణధాన్యాలు తీసుకొచ్చి పాపన్నపేట అంగడిలో విక్రయిస్తుంటారు. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో తృణధాన్యాలు రోజుల వారి ఆహారంలో భాగమయ్యాయి. దీని కోసం వివిధ ప్రాంతాల నుంచి జనాలు ఈ అంగడి వస్తుంటారు. పెసర్లు, కందులు, మినుములు, సిరిశనగలు, శనగలు, బెబ్బర్లు, అనుములు, సజ్జలు, రాగులు, జొన్నలు, పచ్చజొన్నలు, కొర్రలు, అవిసెలు, ఆవాలు, ఉల్వాలు, కుసుమలు, ఆవాలు, గోధుమలు తదితర తృణధాన్యాలు ఇక్కడ తక్కువ ధరలకే దొరుకుతాయి. నాణ్యతగా ఉండటంతో పంటలను సాగు చేయాలనుకునే రైతులు ఇక్కడి నుంచి తీసుకెళ్లిన ధాన్యాలను విత్తనాలుగా వాడుతారు.

ఇరవై ఏళ్లుగా వస్తున్న..

ఇరవై ఏళ్లుగా పాపన్నపేట అంగడికి వస్తున్న. నారాయణఖేడ్, రేగోడ్, హద్నూర్, కంగ్టి, కల్హేర్, ఝరాసంగం, జహీరాబాద్, మనూర్, గూడూర్ తదితర ప్రాంతాల నుంచి తృణధాన్యాలు కొనుగోలు చేసి, పాపన్నపేట, టేక్మాల్ అంగళ్లకు వచ్చి అమ్ముతుంటా. పెద్దగా లాభాలు ఆశించకుండా, కేవలం రోజువారి కూలీ గిట్టుబాటు అయ్యేలా చూసుకుంటా. – స్వామి, నారాయణఖేడ్

సమస్యలు తీర్చని అధికారులెందుకు ?

- గ్రామసభలో అధికారులపై సభ్యుల ఆగ్రహం



ముస్లాపూర్ గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళ

అల్లాదుర్గం(మెదక్): గ్రామాలకు ప్రత్యేక అధికారులు ఉన్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని ముస్లాపూర్‌లో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీ సీఈఓ ఎల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, మురికి కాల్వలు, తాగు నీటి సమస్య, వీధి దీపాలు లేక, బురద రోడ్లతో అవస్థలు పడుతున్నామని పడుతున్నామన్నారు. గ్రామంలో వీధి దీపాలు పెట్టడం లేదని అధికారులపై మండిపడ్డారు. 70 స్తంభాలకు బల్బులు పెట్టినట్లు సిబ్బంది చెప్పాగా.. ఎక్కడ వెలగడం లేదన్నారు. అల్లాదుర్గం బస్టాండ్ బురద గుంటగా మారితే ఎవరు పట్టించుకోవడం లేదన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పంచాయతీల్లో నిధుల మంజూరును బట్టి ఒక్కో పని, గ్రామ సమస్యలు పరిష్కరిస్తామని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య చెప్పారు. వీధి దీపాలు, తాగు నీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి మంత్రి, ఎమ్మెల్యే ద్వారా నిధులు మంజూరైతే పనులు చేస్తామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, ప్రత్యేక అధికారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు. – ఎల్లయ్య, జెడ్పీ సీఈఓ

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి

చిన్నశంకరంపేట(మెదక్): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీఓ దామోదర్ అన్నారు. శనివారం మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాలలో నిర్వహించిన శిక్షక సప్తాహ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే దుష్పలితాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పవేణి, ఎంపీఓ కరీముల్లా, ఉపాధ్యాయులు మాధవి, మంగ, శ్రీనివాస్, వెంకటరమణ, సీఆర్‌పీ ప్రతాప్ పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడద నివారించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: పట్టణ పరిధిలో కుక్కల, కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ పాలక మండలి సభ్యులు తీర్మానించారు. శనివారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన కౌన్సిలర్లు సమావేశమై పలు అంశాలపై చర్చించి కొన్ని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సరిత మాట్లాడుతూ.. పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉందన్నారు. కౌన్సిలర్ సిద్దిఖా మాట్లాడుతూ.. కుక్కల బెడద సైతం తీవ్రంగా ఉందని, కుక్కలు, కోతులు రోజు ప్రజలను కరుస్తున్నాయని అన్నారు. వైస్ చైర్మన్ నయిమోద్దీన్, సభ్యులు సునీతా, రాంచందర్, లలిత, లక్ష్మి మాట్లాడుతూ కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మురికి కాల్వలను సక్రమంగా నిర్వహించాలని సభ్యులు సూచించారు. సమావేశంలో కమిషనర్ జైత్‌రాంనాయక్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, టీపీఓ భూపతి, ఏఈ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

మెదక్‌జోన్: హిందువులపై జైలు అధికారులు వివక్ష చూపుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ కోరారు. శనివారం కేంద్ర మంత్రి అథవాలేకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మెదక్‌లో రెండువర్గాల మధ్య జరిగిన గొడవలో భాగంగా తాము జైలుకు వెళ్లగా, అక్కడ జైలు అధికారులు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారని వాపోయారు. జైలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదన్నారు.

రోడ్డు నిర్మించాలని గిరిజనుల నిరసన



రోడ్డుపై నాటువేస్తూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కొచ్చెరు గ్రామ పంచాయతీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని తండావాసులు రోడ్డుపై నాటు వేస్తూ నిరసన తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. తమ తండా నూతన పంచాయతీగా ఏర్పడినా.. ఇంత వరకు రోడ్డు వేయకపోవడంతో తండాకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందన్నారు. వర్షం పడితే నడవలేని పరిస్థితిలో రోడ్డు ఉందన్నారు. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు పలుమార్లు చెప్పినా.. వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు.

కొనసాగుతున్న రైతుల రిలే దీక్షలు

నర్సాపూర్: కొండ పోచమ్మ వద్దు, సెమీ అర్బన్ ముద్దు నినాదంతో చేపట్టిన రైతుల రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 16వ రోజుకు చేరాయి. సంగారెడ్డి రీచ్ కాల్వకు తమ భూములు ఇవ్వమని రైతులు చెప్తున్నారు. తప్పనిసరిగా తీసుకోవాలంటే భూమికి భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో ఎకరానికి రూ.60 నుంచి రూ.70లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. బీఎస్పీ నాయకుడు జనార్దన్ దీక్షలో పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వ కాలేజీలో నాణ్యమైన విద్య

నర్సాపూర్: విద్యార్థుల జీవితాలలో ఇంటర్ దశ ఎంతో కీలకమైందని, ప్రభుత్వ కాలేజీలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ చెప్పారు. శనివారం కాలేజీలో ఇంటర్ విద్య ప్రాముఖ్యతపై ఆయన మాట్లాడారు. విద్యార్థుల కష్టంతో కాకుండా ఇష్టంతో, పట్టుదలతో చదవాలని సూచించారు. కౌమార దశలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, చెడు వ్యసనాలతో జీవితాలు పాడు చేసుకొవద్దని చెప్పారు. సమావేశంలో పలువురు లెక్చరర్లు పాల్గొని మాట్లాడారు.

రావి పత్రంపై అమ్మవారి చిత్రం



మనోహరాబాద్ (తూప్రాన్): ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మచారి రావి ఆకుపై ఉజ్జయిని మహంకాళి అమ్మవారి రూపాన్ని అద్భుతంగా చిత్రికరించి అందరికి శుభాకాంక్షలు తెలిపాడు.

విద్యార్థులకు బహుమతులు

చేగుంట(తూప్రాన్): జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మోడల్ పాఠశాల విద్యార్థులకు బహుమతులను అందించి సత్కరించారు. నేషనల్ మీన్స్‌స్కాలర్‌షిప్ పథకానికి ఎంపికైన 22 మంది, మెరిట్ సాధించిన నలుగురు, పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు పుస్తకాలను ఇచ్చారు. జీఎంఆర్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, హెచ్‌టీఎంఎస్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ప్రోగ్రాం ఎక్స్‌క్యూటివ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ భూపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గౌస్‌మోహినొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



చిట్కుల్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీఓ శరత్‌కుమార్



కొల్చారం(నర్సాపూర్): సూచనలు చేస్తున్న మండల ప్రత్యేక అధికారి, డీఈఓ రాధాకిషన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో శనివారం పారిశుద్ధ్య వారోత్సవ గ్రామసభలు నిర్వహించామని ఎంపీడీఓ ఆనంద్, ఎంపీఓ శరత్‌కుమార్ అన్నారు. గ్రామ సభల్లో ప్రత్యేకాధికారి, కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశవర్కర్, ఏఎన్‌ఎం, గ్రామస్తులతో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో వారం రోజుల్లో వందశాతం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మురికికాల్వల వెంట ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

కొల్చారం(నర్సాపూర్): గ్రామంలో చేపట్టే పారిశుద్ధ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి డీఈఓ రాధాకిషన్ సంగాయిపేట గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం గ్రామంలో పర్యటించిన ఆయన పారిశుద్ధ్యంపై గ్రామంలో కొనసాగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణవేణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సదాశివుడు, ఏఈఓ నిరోషా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాగునీటి సరాఫరా చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. శనివారం చిన్నశంకరంపేట గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో వందశాతం ఓడీఎఫ్ సాధించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సరాఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రదీప్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిల్వ నీటి తొలగింపు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామంలో తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ మేరకు నీటి నిల్వ తొట్టిలను, పాత టైర్లు, కొబ్బరి బొండాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట నర్సింహారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

పెద్దశంకరంపేట(మెదక్): సీజనల్ వ్యాధులపై గ్రామకార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్‌సప్లయ్ అధికారి హరికృష్ణ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, బాలికల ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, గ్రామకార్యదర్శి వెంకటరాములు తదితరులున్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య పాటించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీనివాస్‌తో పాటు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రాజ్‌పేటలో పీఆర్‌డీఈ అమరేశ్వర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్య పాటించాలని గ్రామస్తులకు సూచించారు.

మురుగు కాల్వల పరిశీలన

- వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పర్యటన



పట్టణంలో మూడో వార్డులో మురుగు కాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పట్టణంలోని పలు వార్డుల్లో మురుగు నిలిచిపోగా, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ వార్డుల్లో పర్యటించి పరిశీలించారు. ఈ మేరకు ఆయన శనివారం సహకార సంఘం చైర్మన్ చంద్రం, బీఆర్ఎస్ నాయకుడు పుట్టి యాదగిరితో కలసి మూడో వార్డులో పూడుకపోయిన మురుగు కాల్వలను పరిశీలించారు. రోడ్డుపై నిలిచిన మురుగునీటిని శుభ్రం చేయాలని, క్రిమి సంహారక మందు స్ప్రే చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో ఏ వార్డులో కూడా మురుగు నీరు నిల్వ ఉండొద్దని ఆదేశించారు. చైర్మన్ వెంట మున్సిపల్ ఏఈ సాయిరాంరెడ్డి, మేనేజర్ శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులు దర్శనం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు ఆచరించారు. ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ తదితరులు ఉన్నారు.

◆ కార్మికులకు రెయిన్‌కోట్‌ల అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాకాలం కావడంతో మండల కేంద్రం మనోహరాబాద్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ కార్యదర్శి రూపగౌడ్ తన సొంతం నిధులతో శనివారం అందజేశారు. కాగా గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వారికి అందజేశారు.

◆ ఆహ్వానం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఇంటర్నేషన్ ప్రెసిడెంట్ లయన్ ఫబిసియోకు కోరినట్లు బాలానగర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. హైదరాబాదులో నిర్వహించిన ఎండీ గ్యాట్ కాంక్లేవ్ మీటింగ్‌లో కలిసి మండలంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించినట్లు చెప్పారు.

◆ వాల్ పోస్టర్ పత్రిక ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): పట్టణంలోని లయన్స్ క్లబ్ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి రూపొందించిన రక్త, అవయవ దానానికి సంబంధించి వాల్ పోస్టర్ పత్రికను క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఫాబ్రిషియో ఓలివైరా ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు పాల్గొనివాల్ పోస్టర్ పత్రికను ఆవిష్కరించారు. క్లబ్ జాతీయ డైరెక్టర్ బాబూరావు, జిల్లాలోని పలు క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

◆ నివాళి

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో దివంగత మాజీ భారత రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను శనివారం నిర్వహించారు. చౌరస్తాలోని కలాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరప్ప, శంకరయ్య, భరత్, జమీర్, ఎల్లయ్య, పాపయ్య, నర్సింలు, రమేశ్, మల్లయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ నోట్ బుక్కుల పంపిణీ

టేక్మాల్(మెదక్): మండలంలోని ఎల్లుపేట గ్రామానికి చెందిన మామిడి సుధాకర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం సీఎం తండాలోని పాఠశాలలోని విద్యార్థులకు రాథోడ్ అనిల్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులను అందించారు. సుధాకర్‌రెడ్డి యువసైన్య సభ్యులు, ఎల్లుపేట మాజీ ఉపసర్పంచ్ మల్లేశం, దాసు, రామకృష్ణ, రాజు, నందరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ కార్యకర్తల సమావేశం

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో మండల బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మెదక్ దళిత మోర్చా అధ్యక్షుడు సంఖ్య యాదగిరి, నాయకులు రమేశ్‌యాదవ్, అజయ్‌కుమార్, ఐలయ్యయాదవ్, నరేష్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీశైలం, మల్లేశ్, లక్ష్మణ్‌సింగ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత బస్‌పాస్‌లను వినియోగించుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఉచిత బస్‌పాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ సిబ్బంది సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నుంచి ఆర్టీసీ సిబ్బంది వైద్యనాథ్, సాయికుమార్‌లు దరఖాస్తులను స్వీకరించారు.

◆ రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంతో పాటు కమలాపూర్, మాడ్చెట్‌పల్లి, మల్కాపూర్ తదితర గ్రామాల్లో రైతుల నుంచి వ్యవసాయ అధికారులు రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. దీంతో పాటు రైతు రుణమాఫీపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు స్వాతి, మమత, సుభాష్ తదితరులున్నారు.

◆ అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని జాజితండా అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్‌ఎం రేణుక, వైద్యసిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత, తండావాసులు పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం

చేగుంట(తూప్రాన్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం చెట్లనర్సంపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆస్పత్రి డాక్టర్లు లాహిరి, స్వేత 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 26 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని, వారిని త్వరలోనే మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి ఆపరేషన్లు చేయించనున్నట్లు లయన్స్ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. అనంతరం సీజనల్ వ్యాధుల నివారణకు మందులను అందించారు. కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వాహకులు గోపి, లయన్స్ ప్రతినిధులు రాంచంద్రం, సతీష్, వీరబ్రహ్మం, సుఖేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

హవేళిఘణాపూర్(మెదక్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని మెదక్ అసెంబ్లీ కన్వీనర్ మధుసూధన్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని సర్దన గ్రామంలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అధిక స్థానాలు కైవసం చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు నర్సింగరావు, విజయ్‌కుమార్, రంజిత్, శ్రీనివాస్, రూపేందర్, శ్రీకాంత్, పోచయ్య, సంజీవరెడ్డి, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

◆ సృజనాత్మకత వెలికి తీయడమే ధ్యేయం

పాపన్నపేట(మెదక్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే అగస్త్య అంతర్జాతీయ ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ సభ్యుడు శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సైన్స్ కృత్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేష్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మోడల్‌స్కూల్ టీచర్ల నిరసన

చిన్నశంకరంపేట(మెదక్): బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం మోడల్‌స్కూల్‌లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 2013లో ప్రారంభమైన మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులుగా చేరిన తమకు ఇప్పటి వరకు సరైన సర్వీస్‌రూల్స్‌లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పదేళ్లుగా కనీసం ఉపాధ్యాయులకు బదిలీలు లేవని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.